క్లుప్తంగా

చోరీకి ప్రయత్నించిన దుండగులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు అజ్మీరా రాజునాయక్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ హనుమకొండలో నివాసం ఉంటున్న రాజు వారంలో రెండు రోజులు స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. కాగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గేట్ తాళాన్ని పగలగొట్టి బైక్ అపహరించేందుకు ప్రయత్నించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాజునాయక్ ఇంటికి చేరుకొని సామగ్రిని పరిశీలించగా బైక్‌ను దొంగలించేందుకే దుండగులు ప్రయత్నించినట్లు నిర్ధారించుకున్నారు. జరిగిన సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాజు వెల్లడించారు.

పంటపొలాల్లోకి గోదావరి బ్యాక్ వాటర్

మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారం లోని గోదావరి తీరంవెంట లోతట్టు ప్రాంతంలోని పంట పొలాల్లోకి గోదావరి బ్యాక్ వాటర్ శనివారం రాత్రి చేరాయి. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సుమారు 20 నుంచి 30 ఎకరాల్లోకి బ్యాక్ వా టర్ చేరినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం గో దావరి వరద హెచ్చ తగ్గుల మీద ఉందని వరద ఉధృతి మరింత పెరిగినట్లయితే లోతట్టు ప్రాంతంలోని సుమారు 50 నుంచి 60 ఎకరాల పంట పొలా ల్లోకి చేరే అవకాశం ఉందని రైతులు వాపోయారు.

వాహనాల తనిఖీ



ములుగు రూరల్: మండలంలోని పస్రాలోని జాతీయ రహదారిపై ఎస్సై కమలాకర్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సిబ్బందితో కలిసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం పోలీసు బలగాలకు, మవోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని అన్నారు.

ఏటూరునాగారంలో..



ఏటూరునాగారం: అభయారణ్యం మారుమూల ఏజెన్సీ అటవీ గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు రొయ్యూరు, చెల్పాక, బానాజీ బంధన్, ఎలిశెట్టిపల్లి, అల్లంవారి ఘనపురం గ్రామాలు ప్రధాన కూడలిల వద్ద రహదారిపై వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. వాహన పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్, ప్రయాణికుల వివరాలు సేకరిస్తూ అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ఈ తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల పరిశీలన



వాజేడు: గోదావరి వరదలో శనివారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లను పరిశీలించారు. ఏడి స్వామిరెడ్డి, ఏఈ అర్షద్ అహ్మద్, జేఎల్ఎమ్ రాజేందర్ నాటు పడవలో గోదావరి వరదలో ఉన్న గుమ్మడి దొడ్డి ఫీడర్‌ను సరిచూసి వచ్చారు. వరద ఎంత వరకు వస్తే విద్యుత్ సరఫరా నిలిపి వేయాలనే విషయంపై పరిశీలన చేసి వచ్చినట్లు వెల్లడించారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 132/33కేవీ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ములుగు, పత్తిపల్లి, కాశిందేవిపేట, మల్లంపల్లి, అబ్బాపూర్, రాంచంద్రాపూర్, పందికుంట, వెంకటాపురం(ఎం), లక్ష్మీదేవిపేట, నర్సాపూర్, వెల్తుర్లపల్లి ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌గా హేమ

చిట్యాల: మండల తహసీల్దార్‌గా నల్లబెల్లి హేమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎండి.ఖాజామొహినుద్దీన్ కలెక్టరేట్‌కు బదిలీ కాగా పలిమెలలో పని చేసిన హేమను ఇక్కడికి బదిలీ చేశారు.

తప్పని వరద కష్టాలు

- రూ.10కోట్లు ఖర్చు చేసినా నిరుపయోగమే
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రాంనగర్-రామన్నగూడెం మధ్యలోని రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

ఏటూరునాగారం: ఇంజనీరింగ్ అధికారులు ముందు చూపు లేని తనంతో మండలంలోని రాంనగర్, లంబాడీతండా గ్రామాల ప్రజలకు వరద కష్టాలు ప్రతి ఏడాది వస్తున్నాయి. వర్షాకాలంలో జీడివాగు ఉప్పొంగడంతో రాంనగర్, లంబాడీతండా గ్రామాలకు, రామన్నగూడెం రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురై రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు గతంలో రూ.4 కోట్లు ఖర్చు పెట్టి కేవలం నాలుగు పిల్లర్లతో బ్రిడ్జి నిర్మించి మిగతాది వదిలేశారు. వరద నీరు బ్రిడ్జికి వేసిన అప్రోచ్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయని 2022లో ఏటూరునాగారం వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్‌కు గ్రామస్తులు విన్నవించగా అప్పటికప్పుడు రూ.6కోట్లు మంజూరు చేశారు. దాంతో ఆ డబ్బుతో ఈ బ్రిడ్జికి ఇరువైపులా గైడింగ్ వాల్ అప్రోచ్ రోడ్డు వేయాలని ఇంజనీరింగ్ అధికారులు ప్లాన్ వేసి పనులు చేపట్టారు. ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రాంనగర్ వెళ్లే రోడ్డుపైకి గోదావరి కమ్ము, జీడివాగు వరద రావడం గ్రామాల ప్రజలు ఆ వాగును దాటలేక నరకయాతన పడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గత పాలకుల తప్పిదం వల్ల రూ.10 కోట్లు ఖర్చు చేసినా రాంనగర్, లంబాడీతండా గ్రామాల ప్రజల సమస్యను తీర్చలేకపోవడం బాధాకరం. ఇంజనీరింగ్ అధికారులు, పాలకులు తెలివితక్కువ తనం వల్ల ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇవే కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. అదే పది కోట్లతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తే దర్జాగా ప్రయాణించే వారమని వాపోతున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి లోతట్టు ప్రజల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాకపోకలు సాగించకుండా ట్రాక్టర్, బారికేడ్లను ఏర్పాటు చేశారు.

బురదరోడ్డుపై నాటేసి నిరసన



బురదరోడ్డుపై నాటు వేస్తున్న మహిళలు

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి గ్రామ పంచాయతీ పరిధి శాలవాడలో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో కాలనీకి చెందిన మహిళలు శనివారం బురదరోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి చినుకుపడితే రోడ్డు మొత్తం బురదమయంగా మారి ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు చొరవ తీసుకోని వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

‘చర్య తీసుకోవాలి’

మంగపేట: ఇసుక క్వారీల్లో ఒక్కో లారీ నుంచి రూ.2500 వసూలు చేస్తు మంత్రి సీతక్కకు ఇస్తున్నారని అసత్యపు ఆరోపణలు చేస్తున్న లారీ ఓనర్ రాజుగౌడ్‌పై చర్య తీసుకోవాలని చుంచుపల్లి నర్సింహస్వామి ఇసుక క్వారీ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పూనం కార్తీక్, జిగట రాణి అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. లారీ ఓనర్ రాజుగౌడ్ మరికొందరు లారీ ఓనర్లు కొందరు బీజేపీ లీడర్లతో కలిసి మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం చేస్తు సోషల్ మీడియాల్లో వాట్సాప్ పోస్టులు పెడుతున్నాడని అతనిపై చర్య తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రాజుగౌడ్ తన పబ్బం గడుపుకోవడానికి ఒక స్థాయి గల వ్యక్తిపై ఆరోపణ చేసే ముందు పూర్తి స్థాయిలో నిజం తెలుసుకోకుండా నలుగురిని వెంట వేసుకుని అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సొసైటీ ఇసుక క్వారీ నిర్వాహకులు పోలెబోయిన రజిత, గ్రామ పెద్ద కుర్సం నర్సింగరావు, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రం సందర్శన



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్సై హరీశ్

వాజేడు: తమకు ఇంటి స్థలాలను ఇప్పించేలా చూడాలని వాజేడు పునరావాస కేంద్రంలోని నిర్వాసితులు ఎస్సై రుద్రారపు హరీశ్‌ను కోరారు. పునరావాస కేంద్రానికి శనివారం ఎస్సై సందర్శించారు. ప్రతీ సంవత్సరం గోదావరి వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి వరదలు తగ్గగానే పంపిస్తున్నారని అలా కాకుండా తమకు ఇంటి స్థలాలను ఇప్పించాలని ఎస్సైని నిర్వాసితులు కోరారు. ఇంటి స్థలాలు ఇస్తే తామే ఇళ్లు కట్టు కుంటామని వారు తెలిపారు. ఇంటి స్థలాలు ఇచ్చే బాధ్యత పోలీస్ శాఖకు లేదని ఆ విషయాన్ని తమ ఉన్నతాధికారుల ద్వారా సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకు వెళ్తనని ఎస్సై వారికి చెప్పారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మంగపేట: నర్సింహాసాగర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున



ఎస్ఎస్ తాడ్వాయి: గొత్తికోయలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక

మంగపేట: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మల్లూరు, పాలాయిగూడెం, నర్సింహసాగర్ గ్రామాల్లో శనివారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాప్తిచెందే సీజనల్ వ్యాధులపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. 42 మంది జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించి వర్షపునీరు, నిల్వ ఉన్న మురుగు గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాంబాయి, హెచ్‌వి పద్మ, ఏఎస్ఎం సారమ్మ, సీతమ్మ, ఆశావర్కర్లు,అనిత, యజ్ఞమ్మ పాల్గొన్నారు.

బోరునర్సాపురంలో వైద్యశిబిరం

మండలంలోని బోరునర్సాపురంలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి ర్యాపిడ్ ఫీవర్ పరీక్షలు నిర్వహించి మలేరియా పాజిటీవ్, నెగిటీవ్ నిర్ధారణ పరీక్షలు చేశారు. జలుబు, దగ్గు, వంటి నొప్పులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి వర్షాకాలంలో వ్యాపించే కీటక జనిత, శ్వాస కోశ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ ఖాదర్ అబ్బాస్, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జలగలంచ గూడెంలో ..

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని లవ్వాల స్టేజీ సమీపంలోని జలగలంచ గొత్తికోయగూడెంలో తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక్, సిబ్బంది శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గూడెంలోని ప్రజలకు డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల భారీన పడకుండా తీసుకోవాలిసిన పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గొత్తికోయలకు అవగాహన కల్పించారు. జ్వరాలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఏఎన్ఎం మంగ, అంగన్‌వాడీ టీచర్ మంజులతో పాటు తదితరులు ఉన్నారు.

కాటారం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్, ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థినులు పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరి చేరవన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు హ్యాండ్‌వాష్ చేసుకోవాలని దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ నిర్మల, ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్త రాజేశ్వరీతో పాటు తదితరులు పాల్గొన్నారు.



బోరునర్సాపురంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వైశాలి

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ.. మండలంలోని జవహర్‌నగర్, లింగాపూర్ గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కనకం రాజేందర్ బృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. వర్షాలపై తీసుకునే జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత గురించి పాటల ద్వారా కళాకారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, బుచ్చన్న, ఈర్ల సాగర్, రవి, రహీమొద్దిన్, సురేష్, కిషన్, విజయ్‌కుమార్, తిరుపతి, దీపక్, భాస్కర్, రాము, శ్రీలత, సామ్రాజ్యం, శోభ పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



బోనాలతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు బోనాల వేడుకలను నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహించే బోనాల పండుగను విద్యార్థులచే నిర్వహించి పండుగ ప్రత్యేకతను వివరించినట్లు ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. తడుక శివ, రెడ్డి వినయ్‌లు పోతరాజు వేషధారణ చేపట్టగా, కోలనుపాక దీక్ష భవిష్యవాణి చెప్పినట్లు వెల్లడించారు. విద్యార్థులు నృత్యం చేసి పలువురిని ఆలరించారు. పిల్లలు బెలూన్స్‌తో సందడి చేశారు. పాఠశాల డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, పసునూటి రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండం జలపాతానికి వెళ్లొద్దు



జలపాతానికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కర్రలు

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సరిహద్దు గుట్టల్లో ఉన్న గుండం జలపాతానికి ఎవరు వెళ్లొద్దని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ అడ్డుగా శనివారం కర్రలను కట్టారు. అరుణాచలపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు నుంచి గుండం జలపాతానికి వెళ్లడానికి దారి ఉంది. అనుమతులు లేక పోయినా కొందరు అత్యుత్సాహంతో వెళ్తున్నారు. దీంతో అటుగా వెళ్లకుండా దారికి అడ్డగా కర్రలను ఏర్పాటు చేశారు.

27 అడుగులకు చేరిన రామప్ప సరస్సు



నీటితో కళకళలాడుతున్న రామప్ప సరస్సు



27 అడుగులకు చేరిన రామప్ప సరస్సు నీటిమట్టం

వెంకటాపురం(ఎం): 15 రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామప్ప సరస్సు నీటితో కళకళలాడుతోంది. 35 అడుగుల నీటి సామర్థ్యం గల రామప్ప సరస్సు ప్రస్తుతం 27 అడుగులకు చేరుకుంది. గతంలో సరస్సులో 20.6 అడుగుల నీరు ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు ఆరున్నర అడుగుల వర్షపు నీరు సరస్సులోకి చేరింది. అధికారికంగా 5,180 ఎకరాలు, అనధికారికంగా మరో 5వేల ఎకరాల అయకట్టు రామప్ప సరస్సు కింద సాగవుతుంది. సరస్సు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలోని తాడ్వాయి, కొడిశాల పరిధిలోని అన్ని గ్రామాల్లో దోమల నివారణకు ఇండోర్ రిసిడీల్, ఆల్ఫా సైపర్ మైత్రిన్ దోమల మందు స్ప్రే చేసినట్లు తెలిపారు. తాడ్వాయి పీహెచ్‌సీ పరిధిలోని తాడ్వాయి, గంగారం సబ్ సెంటర్‌ల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణకు మందు స్ప్రే చేశామన్నారు. మేడారం సబ్‌సెంటర్ పరిధిలోని మేడారం గ్రామంలో మాత్రమే స్ప్రే చేశామని వర్షాలు కురుస్తున్నందున్న రెడ్డిగూడెం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు గ్రామాల్లో దొమల మందు స్ప్రే కార్యక్రమాన్ని నిలిపివేశామన్నారు. వర్షం తగ్గిన తర్వాత వెంటనే ఈ గ్రామాల్లో మందు స్ప్రే చేస్తామన్నారు. నార్లాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని కూడా ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వర్షాల వరదల వలన దోమల మందు స్ప్రే చేయలేదన్నారు. కాటాపూర్ పీహెచ్‌సీ, కాలవ్వపలి సబ్ సెంటర్‌కు దోమల మందు కేటాయించలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దాని వలన పని చేస్తున్న అధికారుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పలగడ్డ, అన్నారం, గంగారం గ్రామాల సమీపంలోని గొత్తికోయలగూడెంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సీవిల్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. గూడెంలలోని కుటుంబ సభ్యుల వివరాలను సేకరించడంతోపాటు కొత్త వ్యక్తులపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను ఎస్సై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను విచారించి వదిలేశారు. మావోయిస్టు వారోవాత్సాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా పోలీసులు తనిఖీలు చేసినట్లు తెలిసింది.

ఏడాది దాటినా గండ్లు పూడ్చరా?



మాట్లాడుతున్న జవహర్‌లాల్

వెంకటాపురం(ఎం): మండలంలోని బుర్గుపేట పరిధిలో గల మారేడుగొండ చెరువుకు గండ్లు పడి ఏడాది దాటినా ఇప్పటి వరకు పూడ్చరా అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మారేడుగొండ చెరువును పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. చెరువుకు పడిన గండ్లు పూడ్చివేయక పోవడంతో ఆయకట్టు రైతులు రెండు పంటలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. చెరువుకు గండ్లు పడి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు వరద నీటికి ధ్వంసం అవుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు పడిన గండ్లను పూడ్చి వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని జవహర్‌లాల్ కోరారు. నాయకులు కారుపోతుల యాదగిరి, ధరంసింగ్, శ్రీధర్, సోనాసింగ్, విక్రాంత్, వినోద్ తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం



టేకుమట్ల: ఇటీవల నూతనంగా ఎంపికైన చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, డైరెక్టర్లు నల్లబెల్లి విజేందర్, కనుమరుగుల సంపత్‌లను మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం దేశీ(డిప్లమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్సివ్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) కమిటీ అధ్యక్షుడు బొడ్డు సదానందం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సదానందం, ఎలవేని రాజేందర్, కొడగాని మహేందర్, ఎంబాడి రాజేందర్, కొడగాని నవీన్, ఇండ్ల మధూకర్, అజయ్, పుప్పాల రాజు, వంగ నరేష్, అనిల్, తదితరులు ఉన్నారు.